క్లుప్తంగా

టంగుటూరి జీవితం ఆదర్శనీయం



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం కళాశాలలో టంగుటూరి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. లెక్చరర్లు ప్రకాశం పంతులు జీవన విధానం, బ్రిటిష్ వారితో పోరాడిన తీరును వివరించారు.

పెండింగ్‌లో 1400 కౌలు కార్డులు



మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న 1400 కౌలు రైతు కార్డులు త్వరితగతిన మంజూరు చేయాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలం వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు అధ్యక్షతన మండలంలోని వ్యవసాయ శాఖ అధ్యక్షులతో సుమతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ దెందులూరు మండలంలో 4000 కౌలు కార్డులకు ఇంకా 1400 కార్డులు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అనంతరం తహసీల్దార్ గ్రామాల వారీగా కార్డుల జాబితాలను పరిశీలించి మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

కొవ్వలిలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, గ్రామ కార్యదర్శులు ఆదిలక్ష్మి, జాహ్నవిలు తెలిపారు. శనివారం వివిధ వార్డుల్లో డ్రెయిన్లలోని చెత్తాచెదారాలను తీయించారు. బ్లీచింగ్ చల్లించారు. వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకు లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య పూజలు



వడలమ్మ ఆలయంలో భక్తుల పూజలు

నిడమర్రు: బువ్వనపల్లి గ్రామ దేవత వడలమ్మ వారి ఆలయంలో శనివారం పోలాల అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి పూజలు, గోపూజల్లో భక్తులు కోడూరి మణి దంపతులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సంకు పులయ్య, సంకు సత్యకుమార్, అల్లుమోలు గంగారాం, కోసూరి పండు తదితరులున్నారు.

హెచ్‌ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



గణపవరం డిగ్రీకాలేజీలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు

గణపవరం: అందరి సహకారంతో ఎయిడ్స్‌ని సమాజం నుంచి చాలావరకు తరిమికొట్టామని, మరింత కృషితో ఎయిడ్ రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ -1, -2 ఆధ్వర్యంలో గుడ్‌ల్యాంప్ ఆర్గనైజేషన్ సహకారంతో ఎయిడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్మలకుమారి మాట్లాడుతూ హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం ఎయిడ్స్ నిర్మూలను తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రాజెక్టు మేనేజర్ మూర్తి మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాపించే విధానాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వరూపరాణి, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లంబోదరుల కనువిందు

- వివిధ రూపాల్లో ప్రతిమలు సిద్ధం చేసిన రాజస్తాన్ కళాకారులు
- భీమడోలు, గుండుగొలను, ఉంగుటూరుల్లో విక్రయాలు
- ఈ ఏడాది తగ్గిన అమ్మకాలు



భీమడోలు : రథంపై వినాయకుని విగ్రహం



భీమడోలు : జంక్షన్‌లో అయోధ్య వినాయక విగ్రహం

భీమడోలు: తెలుగు వారి తొలి పండుగ విఘ్నాలు తీర్చే వినాయక చవితి వచ్చేస్తోంది. పూజలు అందుకునేందుకు గణనాథులు సిద్ధమవుతున్నారు. గణపయ్యను కొలిచేందుకు, మనసారా.. పూజాదికాలు చేయాలనే సంకల్పంతో ప్రతి ఇంటా, వాడవాడలా ఉత్సవాలు చేసేందుకు ఉత్సవకమిటీలు ఇప్పటికే గ్రామాల్లో పందిరిరాట వేసి పనుల్లో నిమగ్నమయ్యారు. ఆర్డర్లపై విగ్రహాలను తయారు చేయిస్తున్నారు.

వివిధ ఆకృతుల్లో ప్రతిమలు

మండలంలోని భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో రాజస్తానీయులు బొజ్జ గణపయ్యను వివిధ ఆకృతుల్లో ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవ కమిటీలు తమకు నచ్చిన విధంగా విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. భీమడోలు జంక్షన్‌లో ఆరు నెలలుగా రాజస్తాన్ కళాకారులు లంబోదరుని భారీ విగ్రహాలు తయారు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో వివిధ రూపాల్లో చిన్న సైజు నుంచి 9 అడుగుల ఎత్తు విగ్రహాలను వివిధ రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. వీటి విలువ సైజును బట్టి రూ.2 వేలు నుంచి రూ.50 వేలు వరకు ఉంది. గుండుగొలనులోని జాతీయ రహదారిపై గత నాలుగేళ్లుగా తాడేపల్లిగూడెంకు చెందిన వ్యక్తి రాజస్తానీయులను తీసుకొచ్చి భారీ విగ్రహాలను తయారీ చేయిస్తున్నారు. 2 అడుగుల నుంచి 11.5 అడుగుల ఎత్తు గల విగ్రహాలను వివిధ ఆకృతుల్లో తయారీ చేస్తున్నారు.



భీమడోలు : జంక్షన్‌లో బుల్లి వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతున్న యువతి



ఉంగుటూరు : లారీపై తరలుతున్న వినాయక విగ్రహాలు



దెందులూరు : వినాయక చవితి పందిరి

పెరిగిన ధరలు

గతేడాది రూ.80 వేలు ఉన్న 60 కిలోల పెయింటింగ్ నేడు రూ.1.30 లక్షలకు పెరిగింది. కూలీల ఖర్చులు పెరిగిపోవడంతో విగ్రహాల ధర సైజును బట్టి రూ.1500 నుంచి రూ.2000కు పెరిగింది. ప్రజలకు సరిగా పనుల్లేకపోవడంతో ఆ ప్రభావం వినాయక చవితి పండుగపై పడనుంది.

చేబ్రోలులో విగ్రహాల ముస్తాబు

ఉంగుటూరు: రాజస్తాన్ కళాకారులు ఉంగుటూరు మండలం చేబ్రోలు రైల్వే గేటు ఎదురుగా గత 18 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. రాజస్తాన్‌లోని భికనీర్ నుంచి మట్టి తెప్పించి విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఈ ఏడాది గత ఆరు నెలల నుంచి వినాయక విగ్రహాల తయారీలో వారు బిజీబిజీగా ఉన్నారు. అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు విగ్రహాలను తయారు చేస్తున్నారు. శివ పార్వతులు నడుమ, ఎలుక వాహనంపైనా, గదతో, పల్లకిలో, ఏనుగు అంబారీపై కూర్చున్న వినాయకుడు ఇలా 35 రకాల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీటిని ఉమ్మడి కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చవితి పందిళ్ల సందడి

దెందులూరు: విఘ్నేశ్వర స్వామి ఆలయాల్లో తొమ్మిది రోజులు పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు గ్రామ గ్రామానా వినాయక చవితి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. దెందులూరు, పోతునూరు, కొవ్వలి, సోమవరప్పాడు, చల్ల చింతలపూడి గ్రామాల్లో చలువ పందిళ్లు నిర్మిస్తున్నారు.

12 ఏళ్లుగా విగ్రహాల తయారీ



గత 12 ఏళ్లుగా వినాయక చవితికి భారీవిగ్రహాలను తయారీ చేసి విక్రయిస్తున్నాం. తనకుటుంబంతోపాటు రాజస్తాన్‌నుంచి కూలీలను తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. వారికి రోజుకు రూ.1500 వరకు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది 80 విగ్రహాలు తయారీ చేస్తే ఇప్పటి వరకు 40విగ్రహాలకు ఆర్డర్లువచ్చాయి. పెద్ద విగ్రహం అమ్మితే రూ.1500 వస్తుంది. గతేడాది 60 విగ్రహాలు మిగిలిపోయాయి.

– దుకారం, విగ్రహాల తయారీదారుడు, భీమడోలు జంక్షన్

లక్షల పెట్టుబడి



గత నాలుగేళ్లుగా గుండుగొలను వద్ద విగ్రహాలు తయారీ చేసి అమ్ముతున్నాం. రాజస్తాన్ కుటుంబసభ్యులు ఏడాది పొడవునా ఇక్కడే ఉండి వినాయక చవితి, దసరా, శ్రీకృష్ణుని విగ్రహాలు తయారీ చేసి అమ్మకాలు చేస్తారు. ఈ ఏడాది అమ్మకాలు తగ్గాయి. గతేడాది 100 విగ్రహాలకు 70 అమ్ముడయ్యాయి. ఈ ఏడాది 100 విగ్రహాల్లో 30 విగ్రహాలే వెళ్తున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడిపెట్టి తీవ్రంగా నష్టపోతున్నాం.

– జి.సాయి, విగ్రహాల తయారీదారుడు, తాడేపల్లిగూడెం

పర్యావరణానికి హాని లేకుండా..



విగ్రహాలు తయారీలో నేను, నా తల్లిదండ్రులు రాధా గోపాల్, కుటుంబ సభ్యులు 20 మంది, బయట కార్మికులు పనిచేస్తున్నాం. ఇక్కడ అమ్మగా మిగిలిన విగ్రహాలను హైదరాబాద్ పంపిస్తాం. ఇలా ప్రతిఏటా వందలాది విగ్రహాలు తయారుచేసి కళాకారులకు పని కల్పిస్తున్నాం. పర్యావరణానికి హాని కలగని రీతిలో పీవోపీతోపాటు ఓ రకమైన మట్టిని కలిపి విగ్రహాలు తయారు చేస్తున్నాం.

– హరేరామ, రాజస్తాన్ కళాకారుడు



భీమడోలు : జంక్షన్‌లో భారీ విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్న దుకారం



ఉంగుటూరు : విగ్రహానికి రంగులు దిద్దుతున్న కళాకారలు



భీమడోలు : జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న భారీ విగ్రహాలు

ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు

భీమడోలు: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.రమాదేవి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం భీమడోలు మండలం భీమడోలు, గుండుగొలను, పూళ్ల, సూరప్పగూడెం, పాతూరు, పొలసానిపల్లి, కొల్లేరు గ్రామాల్లోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తహసీల్దార్ నేతృత్వంలో వ్యవసాయ, మత్స్యశాఖ, సివిల్ సప్లయిస్ శాఖల అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పూళ్లలో పలువురు రైతులతో వారు మాట్లాడారు. నానో యూరియాను వినియోగిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. నానో యూరియా పని చేయడం లేదని, ఘన యూరియాను అందజేయాలని రైతులు కోరారు. రెండో విడత అందించే యూరియాను అందించాలన్నారు. దీనిపై తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు.



పూళ్లలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి, అధికారులు

ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా అందించాల్సిన బాధ్యత డీలర్లదేనని అన్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ ఉషారాణి, ఎఫ్‌డీఓ దుర్గాభవానీ, డీటీ జి.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వల తనిఖీ



యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: రైతుల నుంచి యూరియా సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకూడదని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శనివారం కొవ్వలి కోఆపరేటివ్ సొసైటీలో యూరియా నిల్వలను ఆమె తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. యూరియా అమ్మకాల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు జవాబుదారీగా ఉండాలని, సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేయాలి

నిడమర్రు: ప్రాథమిక పాఠశాలల బలోపేతం ద్వారా పేదలకు విద్యను అందుబాటులో ఉంచడం మనందరి బాధ్యత అని నిడమర్రు ఎంఈఓ-1 అనూరాధ అన్నారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలను ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. వివిధ సబ్జక్టులకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్‌ఏ-1 పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన పుస్తకాలను ఆమె పరిశీలించారు. నూతనంగా ప్రవేశపెట్టిన మూల్యాంకన పుస్తకంలో విద్యార్థి సామర్థ్యాలను ఏడాదిపొడవునా అంచనావేసే అవకాశం ఉందని, వీటిని ఉపాధ్యాయులు బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దంగేటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఝాన్సీ, జల్లా ఏసు, రాంబాబు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ అనూరాధ

ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలి

భీమడోలు: ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను మరింత పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ పీజే అమృతం అన్నారు. పూళ్ల పీహెచ్‌సీని ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లును పరిశీలించారు. ఆసుపత్రుల్లోని ప్రసవాలు, ఇన్, అవుట్ పేషెంట్ల వివరాలను వైద్యాధికారిణి అరుణజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో డెలివరీ అయిన వారితో ఆమె మాట్లాడి, ఇక్కడ సదుపాయాలపై ఆరా తీశారు. రోగుల అభిప్రాయాలపై సంతృప్తిని వ్యక్తం చేశారు. తొలుత స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైవీ లక్ష్మణరావు, హెచ్ఎస్ జి.శ్రీనివాసరావు, స్టాఫ్‌నర్స్ ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పూళ్ల ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ పీజే అమృతం

సెక్రటరీ సుధారాణికి ర్యాంకుల పంట



ఉంగుటూరు: కోరుకున్న ఉద్యోగం సాధించడం ఎంతో మందికి తీరని కల. ఒత్తిడితో కూడిన సచివాలయ కార్యదర్శి ఉద్యోగం చేస్తూ పోటీ పరీక్షల్లో సత్తా చాటారు అప్పారావుపేట సెక్రటరీ సుధారాణి. డీఎస్సీ ఫలితాల్లో ఆమె జిల్లా స్థాయి ర్యాంకులు సాధించి మూడు ఉద్యోగాలకు అర్హత పొందారు. ఎస్ఏలో 4వ, పీజీటీలో 6వ, టీజీటీలో 17వ ర్యాంకు సాధించారు. ఏలూరుకు చెందిన సుధారాణి 2019లో నాటి సీఎం జగన్ సచివాలయ ఉద్యోగాలకు నిర్వహించిన పోటీ పరీక్షల్లో గ్రేడు-5 కార్యదర్శి పోస్టు సాధించారు. యర్రమల్లిపాడులో సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తూ ఇటీవల అప్పారావుపేటకు బదిలీపై వచ్చారు. డీఎస్సీ పోటీ పరీక్షలు రాసి, మంచి ఫలితాలు సాధించారు. సుధారాణిని ఎంపీడీఓ రాజమనోజు, ఎంపీడీఓ ఆఫీసు స్టాఫ్, తోటి ఉద్యోగులు శనివారం అభినందించారు.

విద్యతోపాటు జీవనోపాధిపై అవగాహన



వ్యాపారసంస్థను సందర్శించిన విద్యార్థినులు

గణపవరం: విద్యార్థినులు విద్యతోపాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం తోట సింహాద్రి అప్పారావు అన్నారు. శనివారం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినులను ఒకేషనల్ ఉపాధ్యాయిని ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గణపవరంలోని పలు వ్యాపార సంస్థలను సందర్శించి వ్యాపార లావాదేవీలను పరిశీలించారు. విక్టరీ బజార్‌లో వివిధ వస్తువుల అమ్మకాలు, ధరలు, తగ్గింపు ధరలు తదితర విషయాలపై మేనేజర్ అవగాహన కల్పించారు. ఉపాధిని కల్పించే కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్టు హెచ్‌ఎం అప్పారావు, ఒకేషనల్ టీచర్ స్రవంతి తెలిపారు.

కేంద్రీయ సంస్థల్లో చదువుతో బంగారు భవిత

భీమడోలు: కేంద్రీయ విద్యాసంస్థల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ వంతు కృషి చేయాలని పెదవేగి నవోదయ విద్యాలయ సమితి ఫ్యాకల్టీ కె.రాంబాబు అన్నారు. భీమడోలు మండలం గుండుగొలను మోడల్ ప్రైమరీ పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. పాఠశాలలో 120 మంది విద్యార్థుల్లో 24 మంది ఐదో తరగతి చదువుతుండడంతో ఎక్కువ మంది నవోదయ పరీక్షలకు సిద్ధమయ్యేలా వారికి అవగాహన కల్పించారు. 16 మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డిసెంబర్‌లో మొదటి దశ, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రెండో దశ పరీక్షలు ఉంటాయని తెలిపారు. కేంద్రీయ విద్యాసంస్థల్లో చదువుకున్నట్లయితే బంగారు భవిష్యత్తు ఉంటుందని రాంబాబు వివరించారు. ఆరో తరగతిలో చేరితే ఇంటర్ వరకు అన్ని వసతులతో కూడిన ఉచిత విద్యావకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాశం పాండురంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




విద్యార్థులతో ఫ్యాకల్టీ రాంబాబు, హెచ్‌ఎం పాండురంగారావు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

భీమడోలు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కేవీ తనూజ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎండీఎం నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యదర్శి కేవీ తనూజ పాల్గొన్నారు.

చెరువులకు నీరందించేందుకు కృషి



పొలసానిపల్లి వద్ద తూము ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలవరం కుడి కాల్వ నుంచి పొలసానిపల్లి లింకు చెరువులకు నీరందించేందుకు కృషి చేస్తానని మైనర్ ఇరిగేషన్ ఏఈ కె.లాజర్‌బాబు అన్నారు. గత నెల 28న లింక్ చెరువులకు కుడి కాల్వ నుంచి నీరందించి రైతులను ఆదుకోవాలని గ్రామ మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత అంబటి నాగేంద్ర ప్రసాద్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు వీరవల్లి ఏడుకొండలు, రైతులు తామ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఈ విచారణ చేశారు. పోలవరం కుడి కాల్వ నీటిని లింకు చెరువులకు చేరేందుకు ఏర్పాటు చేయాల్సిన తూము ప్రాంతాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. పోలవరం కుడి కాల్వ పరిధిలోని 12 లింకు చెరులకు నీరందించేందుకు కాల్వ గట్టుపై యూటీని నిర్మిస్తే పంట పొలాలకు పుష్కలంగా నీరందుతుందని, ప్రస్తుతం పైపుల ద్వారా నీటిని తరలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, పోలవరం కుడి కాల్వ నీటి మట్టాలు లేనప్పుడు తమ బాధలు వర్ణనాతీతమని రైతులు వాపోయారు. దీనిపై ఏఈ సానుకూలంగా స్పందించారు. ఉన్నతాధికారులు, పోలవరం కుడి కాల్వ అధికారుల దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతులు కోట శంకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేలో సమస్యలకు శాశ్వత పరిష్కారం

భీమడోలు: భూ సర్వేతోనే రైతులకు శాశ్వత ప్రయోజనాలు చేకూరతాయని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. సూరప్పగూడెంలో శనివారం ఏర్పాటుచేసిన భూ సర్వే గ్రామసభలో రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. గ్రామంలో భూ సర్వే పూర్తయిందని, అభ్యంతరాలు ఉంటే తమకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని రమాదేవి సూచించారు. రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయని చెప్పారు. రైతుల ఫిర్యాదులను గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరావు, మండల సర్వేయర్ ధర్మారావు, వీఆర్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సూరప్పగూడెం రీ సర్వే సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

అధిక రసాయనాలతో ముప్పే



రైతులకు జీవన ఎరువులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదవేగి : అధిక రసాయనికి ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతిని సహజ సిద్ధమైన పంటకు ఉపయోగపడే సూక్ష్మజీవులు చనిపోతాయని ఏఓ డీఆర్సీ ఉష హెచ్చరించారు. శనివారం పెదవేగి మండలం పెదకడిమి గ్రామ పరిధిలో జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు జీవన ఎరువులు, మినుము విత్తనాలను పూర్తి సబ్సిడీతో అందజేశారు. పంట మార్పిడి ద్వారా తెగుళ్ల దరిచేరవని అన్నారు.